# భయం.. భయం

- వీధి కుక్కలు, కోతుల స్వైర విహారం
- భయాందోళన చెందుతున్న పట్టణవాసులు
- ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి



అచ్చంపేట సాయినగర్ కాలనీలో కుక్కలు



అచ్చంపేట గాంధీనగర్ సమీపంలో కోతుల గుంపు

**అచ్చంపేట రూరల్:** పట్టణంలోని వివిధ కాలనీల్లో కోతులు, కుక్కల బెడద తీవ్రమైంది. ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడులు చేస్తున్నాయి. మూడు నెలల వ్యవధిలో వంద మందికిపైగా కుక్కలు, కోతులు దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. పట్టణంలోని మారుతీనగర్, జూబ్లీనగర్, పాతబజార్, గాంధీనగర్, టీచర్స్‌కాలనీ, ఆదర్శనగర్, మహేంద్రనగర్, ఇంద్రనగర్, గోకుల్‌నగర్‌లో బెడద తీవ్రమైంది.

**గాయాలపాలవుతున్న ప్రజలు**

పలు కాలనీల్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా కుక్కలు, కోతులు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. మధ్యాహ్న సమయంలో పాఠశాల నుంచి ఇంటికి భోజనానికి వచ్చిన విద్యార్థులపై కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇది చూసిన కాలనీవాసులు భయాందోళనకు గురై ఇంటి నుంచి బయటకు వెళ్లడం లేదు. ఒకవేళ వెళ్లినా కర్రలు చేతిలో పట్టుకుని వస్తున్నారు. ఒకప్పుడు ఇళ్లలోకి వచ్చి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లే కోతులు ప్రస్తుతం దాడులు చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రజలను కుక్కలు, కోతుల వల్ల ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వాటిని అరికట్టాల్సి ఉండగా, పట్టించుకోకపోవడంతో పట్టణంలో అవి యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు రూ. లక్షల బడ్జెట్ కేటాయించినా ఫలితం లేదు. ప్రధాన రహదారుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

### ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



కోతులు, కుక్కల బెడదను త్వరలోనే తొలగిస్తాం. ఇటీవలే ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అతికొద్ది సమయంలోనే ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కోతులను పట్టుకోవడానికి కష్టతరంగా ఉంది. పట్టుకుని వేరే ప్రాంతంలో వదిలినా, పట్టణం అడవులకు దగ్గరగా ఉండటంతో మళ్లీ వస్తున్నాయి. కౌన్సిల్‌లో ఈ విషయాలపై చర్చించి వెంటనే చర్యలు తీసుకుంటాం.

– శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

## క్లుప్తంగా

### ఘనంగా మాసూంబాబా గంధోత్సవం



**పెంట్లవెల్లి:** మండలంలోని జటప్రోల్‌లో మాసూంబాబా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 39వ ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి గంధోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం రాత్రి 10 గంటలకు దీపోత్సవం వైభవంగా కొనసాగింది. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి, పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

### తర్నికల్‌లో వైద్య శిబిరం



**కల్వకుర్తిరూరల్:** మండలంలోని తర్నికల్‌లో సోమవారం వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పరీక్షలు చేశారు. వైద్యుడు శరత్, గ్రామస్తులు సురేష్‌గౌడ్, రుక్నుద్దీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### 11న పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు



**కొల్లాపూర్:** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలు ఆగస్టు 11న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గౌడ కులస్తులతో పాటు, బహుజనవాదులు హాజరుకావాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సోమవారం పట్టణంలో పలువురికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురగౌని వెంకటస్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, చిలుక వెంకటస్వామిగౌడ్, రామకృష్ణగౌడ్, కట్టా శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

### ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



**వెల్దండ:** మండల కేంద్రంలోని ఏవీఆర్‌గార్డెన్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 150 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శంకరనేత్రాలయ చెన్నై సహకారంతో కంటి వైద్య వైద్య శిబిరం నిర్వహించినట్లు వివరించారు. 1600మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌నాయక్, మల్లయ్య, అనిల్, శ్రీపతి, లాలు, శ్రీను, మహేష్, రాహుల్, భాస్కర్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

### ఉత్సాహంగా గోరింటాకు వేడుక



**కల్వకుర్తిరూరల్:** పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం మహిళలు ఆశాఢమాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశాఢమాసంలో గోరింటాకును పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మౌనిక, రేణుక, రాణి, ధరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

**ఊర్కొండ:** వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని మటన్ దుకాణం వద్ద మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు, తిరుపాల్ మధ్య మాటమాట పెరిగి పరస్పరం దాడి చేసుకున్నారు. ఆంజనేయులుకు రక్త గాయం అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## అటెన్షన్ ప్లీజ్



### పొంచి ఉన్న ప్రమాదం

మండల కేంద్రం నుంచి మేడిపూర్ మీదుగా కల్వకుర్తి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు తాడూరు సమీపంలో రోడ్డును అనుసరించుకొని తవ్విన కాల్వ ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పిచ్చి గడ్డి పెరిగి కాల్వ కనిపించడం లేదు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు కొంచెం ఆదమరిచినా ప్రమాదంబారిన పడే అవకాశం ఉంది.

– తాడూరు

అధికారి: రమాదేవి, డీఈ, ఆర్‌అండ్‌బీ 7287940130

## వీధులను శుభ్రం చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**నాగర్‌కర్నూల్‌రూరల్:** మండలంలోని బొందలపల్లిలో 'అపరిశుభ్రంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకు పరిసరాలు' శీర్షిక పేరుతో సోమవారం సాక్షి దినపత్రిలో వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు అధికారులు స్పందించి గ్రామానికి వెళ్లి అపరిశుభ్రంగా ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయించారు. జేసీబీ సహాయంతో చెత్తచెదారాన్ని తొలగించారు. ఎవరైనా పరిరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కోటేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు హెచ్చరించారు.



చెత్తచెదారాన్ని తొలగిస్తున్న అధికారులు

## నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేయాలి

**వెల్దండ:** నైపుణ్యాభివృద్ధి కళాశాలను కల్వకుర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కల్వకుర్తి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా ట్రిబుల్ ఆర్ రోడ్డు ఆమనగల్లు, వెల్దండ మండలాల గుండా వెళ్లే విధంగా చూడాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోథల పథకానికి పూర్తి స్థాయిలో నిధులను మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న కాల్వలను నిర్మించి రైతులకు సాగునీరు అందించాలన్నారు. గోకారం చెరువును పునఃరుద్ధరణ చేసి రైతులకు సాగునీరు అందేలాచూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగయ్యయాదవ్, బాలస్వామి, మోహన్‌రెడ్డి, విష్ణుగౌడు, వెంకటయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

## 'చలో ఢిల్లీ'కి తరలివెళ్దాం



**నాగర్‌కర్నూల్‌రూరల్:** మాలల అభ్యున్నతి కోసం జాతీయ మాల మహానాడు చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అధికా సంఖ్యలో తరలివెళ్దామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతసత్తి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పట్టణంలో హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో ముద్రించి విద్యార్థులకు ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో మాల ఉద్యోగ సంఘాల నాయకులు కూన గోవర్ధన్, నాయకులు సామ మహేష్, మద్దెల చంటి, మధు, యాదయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రజా అధ్యయన యాత్ర



మంతటిలో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు



రాజాపూర్‌లో

**నాగర్‌కర్నూల్‌రూరల్:** సమస్యలు పరిష్కారంలో అధికారులు విఫలం అయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు అన్నారు. సోమవారం మంతటిలో ప్రజా అధ్యయన యాత్రలో భాగంగా గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు రోజురోజుకు సమస్యలు పేరుకుపోతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, మండల కార్యదర్శి అశోక్, నాయకులు తిరుపతయ్య, వెంకటయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

**తెలకపల్లి:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నందిపేట భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బొప్పల్లిలో ప్రజా సమస్యలపైన గ్రామంలో పర్యటించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీలలో పర్యటించారు. వీధి లైట్లు లేకపోవడం వల్ల కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారన్నారు. కాశన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

**కోడేరు:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాజాపూర్‌లో సమస్యల అధ్యయన యాత్ర నిర్వహించారు. గ్రామంలో విద్యుత్, డ్రైయినేజీ, తాగు నీటి సమస్యలను గుర్తించి నమోదు చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎండీ మాలిక్, వెంకటమ్మ, బుచ్చన్న కురుమయ్య, నాగేంద్రం, రాజు, భగవంతు, నాగమ్మ పాల్గొన్నారు.

**పెంట్లవెల్లి:** మండలంలోని మల్లేశ్వరం, వేముకల్ గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించారు. గ్రామంలో సమస్యలను పరిశీలించారు. పక్కనే కృష్ణమ్మ నిండుకుండలా పరవల్లు తొక్కుతున్నా వందల ఎకరాల భూములు బీడు పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశుద్ధ్యం సమస్యలు తిష్టవేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హనుమంతు, వెంకటయ్య, దేవమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

**లింగాల:** మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో లింగాల అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ పెద్ద పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రపెంట సమీపంలో ఉన్న బేస్ క్యాంప్ దగ్గర తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా అధికారులు, సిబ్బంది కలిసి మొక్కలను నాటారు. పెద్ద పులులు, అడవుల సంరక్షణ గురించి డీఆర్‌ఓ జయదేవ్ ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రాంబాబు, బీట్ ఆఫీసర్లు ఖాదర్‌పాషా, నాగార్జునగౌడ్, మురళీకృష్ణ, శివాజీ, అప్పాయపల్లి, రాయవరం, దారారం బీట్ల అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

## విజయవంతం చేయాలి

**పెద్దకొత్తపల్లి:** పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టేవిధంగా ఎన్డీఏ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వీరబాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్‌మతర్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు వంగపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీక్ష చేపడుతునట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, మండల అధ్యక్షుడు కురుమూర్తి, మధు, రాము, జంపయ్య, పరమేష్, యెలేందర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**కల్వకుర్తిరూరల్:** మండలంలోని తురుకలపల్లి గ్రామానికి చెందిన శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5 వేలు సమకూర్చారు. ఈ మేరకు సోమవారం ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. దారమోని గణేష్, నాగరాజు, ఎల్లయ్య, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన చిన్న అంజయ్య సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ సర్పంచ్ జంగయ్య రూ.3 వేలు, 25 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ పాండుగౌడ్, అంజయ్య, ఆంజనేయులు, రమేష్, నరేష్, విష్ణు తదితరులు పలువురు పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి:** చెన్నపురావుపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షాకీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ మండల సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి సోమవారం రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆర్ఎంపి డాక్టర్ల సంఘం అధ్యక్షులు డా కురుమూర్తి, ఆర్ఎంపీలు భూపాల్‌నాయక్, కృష్ణారెడ్డి, విష్ణుప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నపురావుపల్లిలో ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు కురుమూర్తి

## కంకర వేశారు.. బీటీ రోడ్డు మరిచారు



వెల్దండ మండలం కుందారం-బైరాపూర్ గ్రామాల మధ్యన అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులు

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

**వెల్దండ:** గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లు రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి కంకర వేశారు. మండలంలోని బైరాపూర్-కుందారంతండా, కలకొండ-కుందారంతండాలకు దాదాపుగా 3 కిలోమీటర్లకు ప్రభుత్వం రూ.1.40కోట్లు నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభించి దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా నేటికి బీటీరోడ్డుకు నోచుకోవడం లేదు. మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డులో ప్రయాణం ఇబ్బందిగా ఉండడంతో రంగారెడ్డిజిల్లా ఆమనగల్లు మీదుగా ప్రజలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అదే విధంగా రాచూర్‌తండా రోడ్డుకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించి రోడ్డులో కంకర వేసిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

**కంకర రోడ్డుతో ప్రజల అవస్థలు**


బీటీరోడ్డు కోసం పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి నెలల గడుస్తున్నా నేటికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రోడ్డుపై కంకర ఉండడంతో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణంలో జాప్యం చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి చివరగా ఉన్న తండాలు, గ్రామాలు కావడంతో బీటీ రోడ్డు పూర్తి చేసి బస్సుసౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### పనులు పూర్తి చేస్తాం

గత ప్రభుత్వంలో మండలంలోని ఆయా గ్రామాలకు రోడ్లు మంజూరు చేశారు. టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు. ఎన్నిల కోడ్‌తో పనులు నిలిపివేశారు. నిధుల కొరతతో పనులు ముందుకు సాగడం లేదు. కుందారంతండా, రాచూర్‌తండాలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తాం.

–మహేందర్, పీఆర్ఏఈ, వెల్దండ


### కంకర రోడ్డుతో అవస్థలు



కంకర రోడ్డులో అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచి పోయిన రోడ్డు పనులను ప్రారంభించారు. బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టి సమస్యను తీర్చాలి. కంకర రోడ్డులో ప్రయాణం చేసి ద్విచక్ర వాహన దారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. అనేక సార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు.

–జంగయ్య, బైరాపూర్

### బస్సు సౌకర్యం కల్పించాలి



తండాకు బస్సు సౌకర్యం కల్పించాలి. కంకర రోడ్డు పూర్తి చేసి బీటీని నిర్మించాలి. నిధులు మంజూరైన పనులు పూర్తి చేయడం లేదు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కంకర రోడ్డులో అవస్థలు పడుతున్నాం. దాదాపుగా రెండేళ్లు గడుస్తున్న నేటికి రోడ్డు పూర్తి చేయలేదు. వెంటనే అధికారులు స్పందించి పనులను పూర్తి చేయించాలి.

–సరేందర్, కుందారంతండా

## పీఈటీ పోస్టులను అప్‌గ్రేడేషన్‌కు సహకరించాలి

**నాగర్‌కర్నూల్‌రూరల్:** రాష్ట్రంలో భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సహకారం అందించాలని భాషా పండితుల సంఘం నాయకులు జానయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, జిల్లా నాయకుడు విజయ్‌కుమార్ ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు.

## రిజర్వాయర్ రోడ్డు మరమ్మతు చేయించండి

**వీపనగండ్ల:** ఉమ్మడి మండలంలోని 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రిజర్వాయర్‌కు అనుసంధానంగా 40 గ్రామాలకు మిషన్ భగీథ ద్వారా తాగునీరు అందించేందుకు అధికారులు పిల్టర్ బెడ్లు కూడా నిర్మించారు. మండల కేంద్రంతో పాటు పెబ్బేరు పట్టణం నుంచి రిజర్వాయర్, ఫిల్టర్ బెడ్లకు వెళ్లేందుకు డబుల్ బీటీ రోడ్డును నిర్మిస్తామని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డబుల్ బీటీ రోడ్డు నిర్మిస్తే అధికారులు, రైతులు, అక్కడ పనిచేసే సిబ్బందికి ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

## కొనసాగుతున్న మండపం నిర్మాణం

**కొల్లాపూర్:** పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద నూతనంగా నిర్మిస్తున్న దుర్గామాత మండపం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల ప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. పనుల ప్రగతిని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు పర్యవేక్షిస్తున్నారు.

## ముగిసిన కొడి పీర్ల వేడుకలు



**లింగాల:** మండలంలోని పలు గ్రామాల్లో కొడిపీర్ల పండుగ ముగిసింది. సోమవారం అంబట్‌పల్లిలో పీర్లకు దట్టీలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజు కొడి పీర్లను భక్తుల కోలాహలం మధ్య భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బావులలో పీర్లను నిమజ్జనం చేశారు.

**చారకొండ:** మండలంలోని జూపల్లిలో కొత్త పీర్లపండుగ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామానికి చెందిన సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు రూ.40 వేలు విలువ చేసే 45 తులాల వెండి అభరణాలు వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ గౌడ్, నిర్వహకులు సీరాజ్, అక్రం, షబీర్ తదితరులు ఉన్నారు.